క్లుప్తంగా

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దివ్యాంగ విద్యార్థులపై తల్లి దండ్రులు ప్రేమ చూపినప్పుడే వారిలో మానసిక ధైర్యం లభిస్తుందని ఎంఈవో ఇందిర అన్నారు. ప్రతి శనివారం భవిత కేంద్రం ఆర్పీల ఆధ్వర్యంలో హోమ్ బెస్డు ఎడ్యుకేషన్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని కవలకుంట్ల గ్రామంలో తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థుల ఇంటికి వెళ్లి పరిశీలించి తల్లిదండ్రులకు తగు సూచనలు చేశారు. విద్యార్థులపై ప్రేమ చూపుతూ వారిలో మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. ఐఈఆర్పీటీ ఉపాధ్యాయులు తేజరూపిని పాల్గొన్నారు.

27న మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక

పుల్లలచెరువు: మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో మండల ఉపాధ్యక్షులుగా ఉన్న కందుల వెంకటయ్య ఎంపీపీగా ఎన్నిక కావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఉపాధ్యక్ష ఎన్నికను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వినియోగించుకోవాలి

తాళ్లూరు: వేసవిలో ఎండలు మండుతున్న దృష్ట్యా ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు అధికంగా పండ్ల రసాలు, మంచినీరు తాగాలని డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ కింద ఉన్న బెల్లంకొండవారిపాలెంలో 104 ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ముగ్గురు గర్భిణులకు వారి ఆరోగ్యంపై సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్, ఎంఎల్‌హెచ్‌పీ నాగార్జున, ఏఎన్ఎం మంజుల, ఆశా వర్కర్లు కోటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

● డీఈఓ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

యర్రగొండపాలెం: జిల్లాలో నాలుగు రోజుల నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 618 పాఠశాలల్లో 29,802 మంది విద్యార్థులు 183 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారని, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆయా సెంటర్లలో తగిన ఏర్పాట్లు చేశామని, కొన్ని పాఠశాలల్లో కూర్చొని పరీక్షలు రాసేందుకు బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్న ఉద్దేశంతో ఆయా పాఠశాలల హెచ్ఎంలు బెంచీలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియానికి చెందిన విద్యార్థులు 28,176 మంది, తెలుగు మీడియానికి చెందిన విద్యార్థులు 1,623 మంది, ఉర్దూ మీడియానికి చెందిన విద్యార్థులు ముగ్గురు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 15 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని, పరీక్షల నిర్వహణపై అనునిత్యం ఆయా ప్రాంతాల నిర్వాహకులతో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్షల సమయంలో ఎవరైనా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మార్కాపురం డిప్యూటీ డీఈఓ సామ్యూల్ జాన్, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్, ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్‌లు పెద్దిరాజు, రమాదేవి, పిచ్చిరావు, డీజే ప్రసాద్, యలమంద, మాధవి పాల్గొన్నారు.

దైవక్షేత్రంలో మద్యం అమ్మకాలు

కొనకనమిట్ల: వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం జరిగిన తిరునాళ్ల సందర్భంగా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయని భక్తుల నుంచి విమర్శలు వినిపించాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు జరిగాయి. తిరునాళ్ల కావటంతో ఎంత ధర అయినా పెట్టి మందు బాబులు కొనుగోలు చేస్తారని, ఒక్కో బాటిల్‌కు రూ.50 నుంచి 100 వరకు అదనంగా అమ్మకాలు చేశారని బహిరంగంగానే మందుబాబులు విమర్శించారు. అధికారులు కూడా చూసీచూడనట్లు ఉండటంతో విచ్చలవిడిగా తిరునాళ్లల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారు.

జలగండం

- చిన్నారుల ప్రాణాలు తీస్తున్న ఈత సరదా
- కుటుంబాల్లో నెలకొంటున్న విషాదాలు
- వేసవి సెలవుల్లో జాగ్రత్తలు తప్పని సరి

పెద్దదోర్నాల: ఈత సరదా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పాలిట మృత్యుశాపంగా మారుతోంది. తెలిసి తెలియని వయసు, ఈత నేర్చుకోవాలనే సరదా, స్నేహితుల ఒత్తిడి, అవగాహన లోపం వెరసి పలువురు చిన్నారులు నీటి అడుగున దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించక తమ లేలేత ప్రాణాలను అన్యాయంగా బలి చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే ముగించుకుని తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిలిస్తున్నారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తదితర పథకాలకు అవసరమైన మట్టిని సేకరించేందుకు తీసిన భారీ గుంతలు సైతం ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. వేసవి సెలవులు సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నారుల పట్ల జాగ్రత్తలు అవసరమని పలువురు పేర్కొంటున్నారు.

వరుస సంఘటనలతో బెంబేలు

మండల పరిధిలోని చిన్నగుడిపాడులో వేసవి సెలవులకు గుంటూరు నుంచి అవ్వగారింటికి వచ్చిన బాషా అనే 12 ఏళ్ల చిన్నారి ఈతకు వెళ్లి గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. మండల కేంద్రంలోని ఇందిరా నగర్‌కు చెందిన విద్యార్థులు దూదేకుల లాలావలి (9), కొండబోయిన ప్రసన్న (12)లు మండల పరిధిలోని యడవల్లి వద్ద తీసిన రాళ్ల క్వారీలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. మండల కేంద్రంలోని వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన 9వ తరగతి విద్యార్థి విజయభాస్కర్ తీగలేరు కాలువలో పడి మృత్యువాత పాలయ్యాడు. ఇలా ఎన్నో సంఘటనల్లో చిన్నారులు తమ లేత ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

హెచ్చరిక బోర్డులు లేకనే..

గ్రామీణ ప్రాంతాల్లో తవ్వే గుంతలపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి ఇటువంటి ప్రమాదాలు పునరావృతంకాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. వేసవి సెలవుల్లో తమ పిల్లలు ఆటలకు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తుండాలి.


యడవల్లి క్వారీలో పడి ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు (ఫైల్)

ఆగని మూగజీవాల వలసలు

● పట్టించుకోని ప్రభుత్వం


వలసబాట పట్టిన మూగజీవాలు

కురిచేడు: ఎండల తీవ్రతకు తాగేందుకు చుక్కనీరు లేక, మేత లేక ఆవులు వలసబాట పట్టాయి. నెల రోజులుగా మూగజీవాల వలసబాట కొనసాగుతోంది. జిల్లాలోని పుల్లలచెరువు మండలం నుంచి తొలుత వలసబాట పట్టిన ఆవులు బాపట్ల జిల్లా రేపల్లె అవతల కృష్ణానది పరిసర ప్రాంతాలకు వెళ్తున్నాయి. అదే బాటలో కనిగిరి ప్రాంతం నుంచి ఆవులు వలసబాట పట్టాయి. బాపట్ల జిల్లా రేపల్లె వరకు వెళ్తామని, నీరు లేక, మేత లేక వలసబాట పట్టాల్సి వచ్చిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయి తిరిగి తొలకరి జల్లులు కురిసి వాగులు, వంకలు నిండిన తర్వాతే ఇళ్లకు వస్తామని పశుపోషకులు పేర్కొంటున్నారు. పశువులను కాపాడుకోవడమే తమ ముందున్న కర్తవ్యమని, వాటి కోసం ఎంతటి కష్టాలు పడటానికైనా సిద్ధంగా ఉన్నామని, తమను నమ్మి తమతో పాటు వ్యవసాయంలో సాయం చేస్తున్న మూగజీవాలను కాపాడ లేకుంటే రైతే లేడని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగా గ్రాసం పెంపకం ప్రోత్సహించి పశుపోషకులకు సాయం అందించారు. దీంతో నీరు ఉన్న ప్రాంతాల్లో గ్రాసం పండించి అవసరమైన చోటకు రైతులకు సరఫరా చేసే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. కూటమి ప్రభుత్వం రైతు భరోసాను వదిలేసి, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా వంటివి సరఫరా చేయక పోవటంతో రైతులు నష్టపోవటమే కాకుండా మూగజీవాలు కూడా వలసబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొందని పశుపోషకులు, రైతులు విమర్శిస్తున్నారు. మార్చి నెలలోనే వలసలు ప్రారంభమైతే ఇక రాబోయే మే, జూన్ నెలల పరిస్థితిని ఊహించుకుంటేనే భయమేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీసం మూగజీవాలకు అవసరమైన నీరు, మేత ఉచితంగా సరఫరా చేసి ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

వేసవి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారాణి

దర్శి: వేసవి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి సూచించారు. శనివారం జరిగిన శిక్షణ, సందర్శన కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పంటలు, యాజమాన్య పద్ధతులపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు నీటి తడులు ఇచ్చుకునే అవకాశాలుంటే నువ్వులు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న నీటి తడులు ఇస్తే ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. నువ్వుల్లో వైఎల్ 66 లేదా వైఎల్ఎం 146 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల మాట్లాడుతూ జిల్లా లోని వర్షపాత వివరాలు, సాగు పంట విస్తీర్ణం గురించి వివరించారు. ప్రస్తుతం దాదాపు అన్నీ పంటలు కోత దశలో ఉన్నాయని, వేసవిలో వేసుకున్న పప్పు దినుసులు, వరి, పత్తి పంటలు అనేక దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పంటలపై రైతులకు సమస్యలు, సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ వారికి సమాధానాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో సాగు చేస్తున్న పత్తిలో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి పత్తిలో రసం పీల్చే పురుగులు, గులాబీ రంగు పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశాలున్నాయన్నారు. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మామిడి, మిరపలో వచ్చే పురుగు తెగుళ్ల సమస్యల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

సాగర్ పైప్‌లైన్ లీకు

● వృథాగా నీరు

దొనకొండ: సాగర్ జలాలు పైపులైన్ సుమారు పది రోజుల క్రితం లీకై నీరు వృథాగా పోతోంది. దీంతో భూమనపల్లి ఎస్సీ కాలనీకి సాగర్ జలాలు సరఫరా కావడం లేదు. కాలనీ వాసులకు సాగర్ నీరు తప్ప ప్రత్యామ్నాయ మార్గం లేదు. సాగర్ పైప్‌లైన్ పొలాల్లో నుంచి వెళ్లడంతో రైతులు, పశుపోషకులు పగలకొట్టడంతో నీరు వృథాగా పోతోంది. పైపులైన్ లీకైన విషయాన్ని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక చేతి పంపు నీరు తాగడంతో వ్యాధులకు గురవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీరు వృథా కాకుండా మరమ్మతులు చేపట్టి నీరు సరఫరా అయ్యేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


వృథా అవుతున్న ఎన్ఏపీ నీరు

మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ విజయనిర్మల

దర్శి: మిద్దె తోటల పెంపకంపై వ్యవసాయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఆత్మా డీపీడీ ఎం.విజయ నిర్మల సూచించారు. స్థానిక కేవీకేలో దర్శి సబ్ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి హోమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమం శనివారం జరిగింది. ఏడీఏ బాలాజీనాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయ నిర్మల మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల సిబ్బంది..వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిపి అందరి భాగస్వామ్యంతో పెరటి తోటలు విజయవంతం చేయాలని సూచించారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రభుత్వ పథకాలను రైతు వద్దకు చేర్చి అన్నీ పథకాలు విజయవంతం చేయాలని సూచించారు. డీఆర్సీ వ్యవసాయాధికారులు శైలజారాణి, వీవీ శేషయ్య మాట్లాడుతూ హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెనింగ్, పోషక గార్డెనింగ్ గురించి పీపీటీ ద్వారా వివరించారు. ఉద్యాన శాఖాధికారి ఎం.రవివెంకన్నబాబు మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అమలులో ఉన్న పథకాల గురించి వివరించారు. కిచెన్ గార్డెన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వెల్లడించారు.

ఓటర్ కార్డులకు ఆధార్ తప్పనిసరి

బేస్తవారిపేట: ప్రతి ఓటర్ కార్డుకు ఆధార్ నెంబర్‌ను లింక్ చేయాలని వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకట శివరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట మండలంలోని 55 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితాలోని ప్రతి ఓటర్‌కు ఆధార్‌కార్డు నమోదు చేయాలన్నారు. ఫారమ్–6, 7, 8 చేర్పులు, తొలగింపులు, సవరణలు ఎప్పటికప్పుడు సకాలంలో విచారణ చేసి పూర్తి చేయాలని సూచించారు. 1200 ఓట్లు దాటితే కొత్త బూత్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. మండలంలోని 55 పోలింగ్ బూత్‌లలో 323 ఓటర్లకు ఆధార్‌కార్డు జత చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, డీటీ సలీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు భవానీప్రసాద్


ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాల అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం, కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి


జేఈ హనుమాన్‌తో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

దర్శి: ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటంశెట్టి హనుమంతురావు డిమాండ్ చేశారు. దర్శి నగర పంచాయతీ ఎన్ఏపీ తాగునీటి ట్యాంక్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో పని చేస్తున్నామని చెప్పారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కింద పని చేస్తున్న 35 మంది కార్మికులు శనివారం 56 గ్రామాలకు నీటి సౌకర్యం నిలుపుదల చేశారన్నారు. జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్‌లో పని చేస్తున్న ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. నిరసన జరుగుతున్న ప్రదేశానికి జేఈ హనుమాన్ వచ్చి ఎస్ఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లి నెల రోజుల్లో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు ధర్నా విరమించారు. శింగరకొండ శ్రీను, విజయ్, బాబు పాల్గొన్నారు.

నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ రమేష్

దర్శి: నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వ్యవసాయంలో నీటి వినియోగం ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయ సాగులో సక్రమంగా నీటి వినియోగం జరగాలంటే మైక్రో ఇరిగేషన్ పద్ధతులను రైతులు అవలంభిస్తే నీటి వినియోగం సమర్థంగా జరుగుతుందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని సాగు చేసుకోవచ్చని తెలిపారు. నీరు లేనిదే జీవకోటి మనుగడ సాధ్యపడదని గుర్తు చేశారు. నీరు అనేది జీవకోటిలో ప్రతి జీవికి, ప్రాణికి అవసరమని, నీటిని వృథా చేయకుండా అవసరం మేరకే ఉపయోగించుకొని భావితరాలకు అందించాలన్నారు. నీటి సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టి. వెంకటేశ్వర రెడ్డి, టి.మానస, రైతులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నిఖిత

దర్శి: ఫోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కె.నిఖిత సూచించారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్లో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థినుల వసతి సౌకర్యాలు పరిశీలించారు. ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి నిఖిత మాట్లాడుతూ పిల్లల రక్షణ కోసం 2012లో ఫోక్సో చట్టం వచ్చిందని చెప్పారు. 18 ఏళ్లలోపు బాలికలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అసభ్యకర చిత్రాలు, సైన్స్ చూపించినా, ప్రైవేటు పార్ట్‌లు టచ్ చేసినా ఫోక్సో చట్టం కింద శిక్షించనున్నట్లు పేర్కొన్నారు. బాలికలు వెంటనే తమ తల్లిదండ్రులకు చెప్పి ఫోక్సో చట్టం కింద కేసు పెట్టొచ్చన్నారు. బాలురకు కూడా ఈ చట్టం వర్తిస్తుందని సూచించారు. బాలికలు చిన్న వయసులోనే చట్టాలు తెలుసుకోవాలన్నారు. చట్టాలు తెలుసుకునితోటి వారికి వాటిని వివరిస్తే నేరాలు తగ్గుముఖం పడతాయని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకుని గోల్ ఎంచుకుని సాధించే వరకు కష్టపడాలన్నారు. న్యాయవాదులు ఎస్వీ సుబ్బారెడ్డి, పి.మనోహరమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎరువులే విక్రయించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని డీలర్లకు ఏఓ బుజ్జిబాయి సూచించారు. మండలంలోని గొబ్బూరులో సాయితేజ ఎంటర్ ప్రైజెస్ షాపును శనివారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేని వాటిని డీలర్లు అమ్మకూడదని, అమ్మితే దుకాణాన్ని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే ఎరువులు, విత్తనాలు రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. బయట దళారులు అమ్మే లూజ్ విత్తనాలు, కల్తీ ఎరువులు రైతులు కొనుగోలు చేయరాదని, ఎవరైనా గ్రామాల్లో అమ్మితే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం క్రితం బోయిదగుంపుల గ్రామంలో రాత్రి సమయంలో దళారులు కల్తీ ఎరువులు తీసుకొచ్చి వర్మీ కంపోస్ట్..అని అమ్ముతున్నారని, అలాంటి ఎరువులను రైతులు కొనుగోలు చేయరాదని ఏఓ బుజ్జిబాయి సూచించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సుజాత తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతికి 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీకి 40 సీట్లు, అదేవిధంగా 7,8,9,10, 12 తరగతిలో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 95158 38862 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ అనూష తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు. దీంతో పాటు 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సెమీ ఆర్ఫాన్, ఆర్ఫాన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, బీపీఎల్ విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. మార్చి 22 నుంచి ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు.

ఆలయంలో బహిరంగ వేలం

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం లక్ష్మమ్మ వనంలోని కల్యాణ మండపంలో వివిధ షాపులకు వేలం నిర్వహించారు. శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య అధ్వర్యంలో వేలం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ.16.25 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి బీ నాగమల్లేశ్వరరాజు, అర్చకుడు అన్నవరం సత్యనారాయణచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.